క్లుప్తంగా

రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన సుధీర్‌రెడ్డి



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సుధీర్‌రెడ్డి

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డిని తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంకెపెల్లి సుధీర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

అర్వపల్లి : రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజులకు స్థానం కల్పించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరి గెలుపొందారని చెప్పారు. బీసీ కులాల్లో ముదిరాజ్ సామాజికవర్గం పెద్దదని.. ఈ సామాజిక వర్గం నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కృష్ణ, వెంకన్న, అర్వపల్లి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నూతనకల్ : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు గురువారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, కల్లెం కృష్ణారెడ్డి, పన్నాల మల్లారెడ్డి, తొనుకునూరి సైదులు, వెంకటేష్ ఉన్నారు.

ఉత్తమ్ ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌ను పలువురు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మృతుడికి కాంగ్రెస్, సీపీఎం నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన జిట్టబోయిన శ్రీరాములు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అతడి మృతదేహాన్ని కాంగ్రెస్, సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ పాలెల్లి సురేష్, సీపీఎం మండల మాజీ కార్యదర్శి ఎల్లంల అవిలయ్య, వేములకొండ ఉప్పలయ్య, రత్నం లక్ష్మాజీ, బొల్లం వెంకటేశ్వర్లు, బీరవోలు వాసుదేవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగేందర్ తదితరులు ఉన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు. గురువారం చింతలపాలెంలో మండల రైతు జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత రెండు మూడు రోజులుగా మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వందలాది ఎకరాల్లో మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. చేతికి వచ్చే సమయంలో పంట నష్టపోయామని, అయినా తమను పట్టించుకునే వారు లేరని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే కనీస నష్ట పరిహారం చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు జేఏసీ కమిటీ నాయకులు మోర్తాల నాగిరెడ్డి, ఉసిరికాయల వెంకట్, కందుల రామకృష్ణారెడ్డి, కనితి ప్రశాంత్, ఎస్‌కే షబ్బీర్, సంజీవరెడ్డి, సైదిరెడ్డి, వెంకటరెడ్డి, ఎస్‌కే చిన్నబాబు, శంభులింగం, కాశయ్య, లక్ష్మారెడ్డి, హుస్సేన్, ఇమ్రాన్, ఖాసీం పాల్గొన్నారు.

నీటి విడుదల షెడ్యూల్ ఎప్పుడో?

- గోదావరి జలాల కోసం ఎదురుచూపు
- తుంగతుర్తి నియోజకవర్గంలో రెండవ దశ కింద 1,40,000 ఎకరాల్లో సాగు
- నీటి విడుదల షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరుతున్న రైతులు



అర్వపల్లి శివారులో దున్నిన పొలం



నీళ్లు నిలిచిపోయిన 71డీబీఎం కాలువ

అర్వపల్లి : ప్రస్తుత యాసంగి సీజన్‌కుగాను పంటల సాగు పనులు మొదలయ్యాయి. నీటి వసతి ఉన్న రైతులు పొలాలు దున్నుకుంటుండగా గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగుచేసే రైతులు ఆ నీటి కోసం ఎదురు చూస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కువగా రైతులు గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. అయితే ఈసారి అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అధికార యంత్రాంగం ఆ బిజీలో ఉండటంతో నీటి విడుదల షెడ్యూల్‌లో జాప్యం నెలకొంది. రైతులు మాత్రం షెడ్యూల్ ప్రకటిస్తేనే పంటల సాగుకు ముందుకెళ్లే అవకాశం ఉంది. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి, తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల మండలాల్లో ఎస్సారెస్పీ రెండవ దశ కింద సుమారు 1.40లక్షల ఆయకట్టు సాగవుతుంది. కొద్ది మంది రైతులకు మాత్రమే బోర్లు ఉన్నాయి. మిగిలిన రైతులందరు గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. అయితే ప్రతి యాసంగి సీజన్‌లో డిసెంబర్ 25 వరకు గోదావరి జలాలను విడుదల చేస్తారు. ఈసారి కూడా అలాగే నీళ్లు వస్తాయనే ఆశలో అన్నదాతలు ఉన్నారు. బోర్లు ఉండి నీటి వసతి ఉన్న రైతులు మాత్రం పొలాలు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. మిగిలిన రైతులు గోదావరి జలాలు వస్తేనే ఈ సీజన్ వ్యవసాయ పనులను ప్రారంభించనున్నారు.

షెడ్యూల్ త్వరగా ప్రకటించాలి



నార్లు పోసుకునే సమయం వచ్చినందున నీటి విడుదల షెడ్యూల్‌ను అధికారులు ప్రకటిస్తే ఆ ప్రకారం పంటలు సాగుచేసుకుంటాం. షెడ్యూల్ ప్రకారం పొలం ఎంత సాగుచేసుకోవాలనే విషయాన్ని నిర్ణయించుకుంటాం. ప్రతి సీజన్‌కు విడుదల చేస్తున్న మాదిరిగానే షెడ్యూల్‌ను ప్రకటించాలి.

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

ఈ నెల 25 వరకు నిర్ణయం



కాళేశ్వరం జలాలను విడుదల చేసే విషయమై ప్రభుత్వ స్థాయిలో ఈ నెల 25 వరకు నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల వల్ల రాష్ట్ర స్థాయిలో జరగాల్సిన నీటి పారుదల శాఖ ఉన్నతస్థాయి సమావేశం ఆలస్యమైంది. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్‌లో కూడా నీటిని విడుదల చేయనున్నాం. ప్రభుత్వ నిర్ణయం వెలువడగానే షెడ్యూల్ విడుదల చేస్తాం.

– ఎం. సత్యనారాయణ, బయ్యన్నవాగు డీఈఈ

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తుంగతుర్తిలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తుంగతుర్తి : గత మూడు రోజులుగా తుపాన్ కారణంగా ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఎంతో శ్రమపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ కారణంగా తడిసిపోయిందని అన్నారు. రైతులు నష్టపోకుండా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు తడిసిన ధాన్యాన్ని వెంటనే తీసికొని, కాంటాలు వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు బుర్ర శ్రీనివాస్, పల్ల సుదర్శన్, ముత్తయ్య, నర్సయ్య, లింగయ్య, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

భానుపురి : అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ బెలిదె శ్రీనివాసులు అన్నారు. ఉత్తర నక్షత్రం సందర్భంగా సూర్యాపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పడిపూజ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. దాదాపుగా ఐదు గంటల పాటు అయ్యప్పస్వాముల శరణ ఘోషల మధ్య పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బెలిదె శ్రీనివాసులు మాట్లాడారు. ఆలయంలో దాతల సహకారంతో కార్తీక మాసం మొదటి రోజు నుంచి 800 మంది అయ్యప్పస్వాములకు ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శబరినగర్ అయ్యప్పస్వామి దేవాలయం నందు ఈ సంవత్సరం 3,500 మంది స్వాములు మాలధారణ చేశారని చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మనసాని రామ్మూర్తి, జేపీటీ గురుస్వామి, గొట్టిముక్కల శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష మేరకే సీఎంగా రేవంత్



మద్దిరాలలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

మద్దిరాల : ప్రజల ఆకాంక్ష మేరకే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. గురువారం రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అవిలమల్లు, జగన్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఉపేందర్, సురేష్, కుతిబుద్దీన్, అమృతమల్లు, లింగయ్య, భిక్షపతి, మల్లయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన

భానుపురి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజక పాలన కొనసాగిస్తుందని మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొండగడుపుల సూరయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సామాజిక న్యాయం అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషించాడని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదాకా నెత్తి పెంచకుండా గుండుతోనే ఉంటానని ప్రతిజ్ఞ చేశానని.. నేడు నా ప్రతిజ్ఞ నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మార్త కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నలమాస ఉపేందర్, అనిల్, యాకస్వామి, సాయి, రాకేష్, రమేష్, అవిలయ్య, లింగరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం, అర్వపల్లి క్లస్టర్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వ్యవసాయ విస్తరణ అధికారులు నేరేళ్ల సత్యం, శోభారాణి సందర్శించారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పచ్చిగా ఉన్న ధాన్యాన్ని ఆరబోసి ఎండబెట్టాలని రైతులకు సూచించారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం.. అవస్థల్లో జనం

- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- డ్రైడేను పాటించని అధికారులు



భీమ్లాతండాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



సేవాలాల్ తండాలో చెత్త, పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురుగు కాలువ

చివ్వెంల : గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎక్కడిక్కడ రోడ్లపైనే మురుగు నీరు చేరడంతో వ్యాధులు విజృంభించడానికి అవకాశం ఉంది. అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడు హడావుడి చేసి పారిశుద్ధ్యం మెరుగు పర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని అంటున్నారు తప్ప ఆచరణలో కనబడడంలేదు. పారిశుద్ధ్యం మెరుగునకు కమిటీలు వేస్తున్నామని.. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తున్నామని చెప్పడం తప్ప ఎక్కడా ఆచరణలో అమలు చేయడం లేదు. దీంతో ఏ గ్రామంలో చూసినా మురుగు, చెత్తా చెదారం పేరుకుపోయి ఇబ్బందికరంగా మారింది. మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పాశ్యానాయక్‌తండా, పిల్లలజెగ్గు తండా, వాల్యతండా, బద్యాతండా, జయరాంగుడి తండా, బి.చందుపట్ల, అక్కలదేవిగూడెం, మున్యానాయక్‌తండా, పాండ్యానాయక్ తండా, రోళ్లబండ తండా, వట్టిఖమ్మంపహాడ్, లక్ష్మణ్ నాయక్ తండా, పులితండా, సేవాలాల్‌తండా, భీమ్లాతండా, మొగ్గయ్యగూడెం తదితర గ్రామాల్లో మురుగు, చెత్తా చెదారం ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. మురుగు వల్ల ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించలంటూ ఆదేశాలు ఉన్నాయి. అయినా ఇంతవరకు ఏ అధికారి కూడా ఆ ఆదేశాలను పాటించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

గ్రామంలో మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. దీంతో దుర్వాసన వస్తుంది. ప్రజలు రోగాల బారిన పడకముందే అధికారులు కాలువలు శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలి.

– రమావత్ మంగ్తా నాయక్, రోళ్లబండ తండా

పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం

గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా చూస్తాం.

– టి.గోపి, ఎంపీఓ

ప్రభుత్వ ఉపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈఓలు

- అదనపు పనిభారంతో ఆందోళన చెందుతున్న హెచ్‌ఎంలు
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ



తిరుమలగిరి మండల విద్యా వనరుల కేంద్రం

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాటి పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. మండల విద్యాధికారి (ఎంఈఓ) పోస్టులను జిల్లాలో అవసరాల కొద్ది ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిమ్మిది మండలాల్లో అన్ని చోట్లా ఇన్‌చార్జ్ ఎంఈఓలే ఉన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులే ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా కొనసాగుతుండటం వల్ల ఈ రెండు పోస్టులకు వారు న్యాయం చేయలేకపోతున్నారు.

పర్యవేక్షణ అయోమయం..

ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు ఉన్న ఒక్కో ఇన్‌చార్జ్ ఎంఈఓ తన పాఠశాలతో పాటు నెలకు కనీసం 20 పాఠశాలలను పర్యవేక్షించాలి. ప్రస్తుతం వాళ్లు ఎన్ని పాఠశాలలను పర్యవేక్షించాలన్న విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం నివేదికలు, పాఠ్య పుస్తకాల సరఫరా, మరుగుదొడ్లు, తాగు నీరు, తరగతి గదుల నిర్మాణాలు, బోధన, ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ప్రగతి నివేదికలకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు సమాచారం పంపాల్సి ఉంటుంది. కానీ ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు నిర్వర్తించడం హెచ్‌ఎంలకు తలకు మించిన భారంగా మారి విద్యా ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయి. రికార్డుల నిర్వహణ, సమావేశాలతోనే వారి విధులు నడిపించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పూర్తిస్థాయిలో ఎంఈఓల నియామకం జరగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి



ఇన్‌చార్జ్ ఎంఈఓల వల్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం పడుతుంది. పాఠశాలల పర్యవేక్షణ సరిగా జరగడం లేదు. ప్రభుత్వం రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి.

– చల్లగుండ్ల సోమయ్య, ఉపాధ్యాయుడు

రైతులకు తుపాను గుబులు

- ముసురుతో పత్తి, వరి పంటలపై తీవ్ర ప్రభావం
- ధాన్యాన్ని కాపాడేందుకు రైతుల పాట్లు



వర్షానికి తడిసిన పత్తిని పరిశీలిస్తున్న అధికారి

పెన్‌పహాడ్ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలకు పత్తి తడిచిపోగా, వరి పైరు నేలకొరిగింది. దీంతో పత్తి ఏరే అవకాశం లేకుండా పోయింది. వరి పొలాలు తడిగా మారి కోతలు చేపట్టేందుకు వీలుకావడంలేదు. మళ్లీ ఎండలు కొడితే తప్ప వ్యవసాయ పనులు సాగే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

ఆరంభంలోనే మొదలైన కష్టాలు..

మండలంలో వానాకాలం సీజన్‌లో వేసిన పంటలు తీరా చేతికందే దశలో అకాల వర్షాలతో దెబ్బతింటున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితుల మూలంగా రైతుల వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. వానాకాలం సీజన్‌కు గానూ పెన్‌పహాడ్ మండలంలో సుమారు 3200 ఎకరాల్లో పత్తి, 25312 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం మండలంలో చాలా మంది రైతులు ఇంకా మొదటి దశలో కూడా పత్తి ఏరే పనులు చేపట్టలేదు. కూలీల కొరత మూలంగా పనులు సాగడం లేదు. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలతో వేలాది ఎకరాల్లో పత్తి పంట చేలల్లోనే తడిసి ముద్దయ్యింది. అతికొద్ది మంది రైతులు మాత్రమే మొదటి దశ పత్తిని ఏరి ఇళ్లలో భద్రపర్చుకున్నారు.

వరి పంటపై ప్రభావం..

మండలంలో సాగు చేసిన వరి పంట కోత పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ముందుగా వరిసాగు చేపట్టిన రైతులు ఇప్పటికే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్మకాలు జరుపుతున్నారు. ఇంకా కొంతమంది రైతులు హార్వెస్టర్ యంత్రాల కొరత కారణంగా కోతలు చేపట్టాల్సి ఉంది. ఇటువంటి సమయంలో తుపాను కారణంగా కురుస్తున్న ముసురు, వర్షాలతో అన్నదాతకు ఇబ్బందులు తప్పడంలేదు. ఓ వైపు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు తడుస్తుండగా మరోవైపు కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు దెబ్బతింటుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10న కార్తీకమాస వన సమారాధన

కోదాడఅర్బన్ : కార్తీక మాసం చివరి ఆదివారం (ఈ నెల 10వ తేదీన) సందర్భంగా కోదాడ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బ్రాహ్మణులకు కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం ఆహ్వాన కమిటీ తెలిపింది. కోదాడలోని గాయత్రీ భవన్ (బ్రాహ్మణ సంఘం భవనం)లో ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి కోదాడ నియోజకవర్గ బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

కోదాడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన కార్తీక మాస చివరి ఆదివారం సందర్భంగా కార్తీక వనసమారాధన(వనభోజనాలు) నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు గురువారం తెలిపారు. కోదాడలోని రామిరెడ్డిపాలెం రోడ్డులో ఉన్న నాగుబండి రంగా మామిడి తోటలో ఈ కార్యక్రమం ఉంటుందని, ఉదయం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, వ్రతాలు ఉంటాయని ఆర్యవైశ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంపై హర్షం

మోతె : తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మోతె మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం మోతె మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి స్వీట్లు, మిఠాయిలు పంచిపెట్టి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే 6 గ్యారంటీలపై సంతకం చేసి తమ సత్తా చాటిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు..

నేరేడుచర్ల : తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టడం పట్ల గురువారం నేరేడుచర్లలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలి వద్ద బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జనవరిలో భక్త సమ్మేళనం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో రామకృష్ణ – వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 20, 21 తేదీల్లో 5వ వార్షిక భక్త సమ్మేళనం నిర్వహించనున్నట్లు స్థానిక రామకృష్ణ సేవా సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భక్త సమ్మేళనంలో పాల్గొనే వారికి ప్రవేశ రుసుం ఉంటుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని వారు కోరారు.

యువత మద్యం, నోట్ల కట్టలకు లొంగొద్దు

నడిగూడెం : సర్పంచ్ ఎన్నికల్లో యువత మద్యం, నోట్ల కట్టలకు లొంగవద్దని తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ నవీన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లో రాజకీయ నాయకులు యువతకు జెండాలు చూపి, మద్యాన్ని ఎర వేసి పెడదోవపట్టేలా చేస్తున్నారని అన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు ఈనెల 12 నుంచి తపాలా ఉద్యోగులు చేపట్టబోయే సమ్మెను విజయవంతం చేయాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు కోరారు. గురువారం నేరేడుచర్లలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని విధానం అమలు చేయడంతో పాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలని కోరారు. సీనియర్ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీపీఎంలు రామ నర్సయ్య, రమేష్, జ్యోతి, రమేష్, మర్రి చెన్నయ్య, పుల్లయ్య, నారాయణ, అశ్విని, ఉష, సునీత, శివ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పోస్టల్ సిబ్బంది

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



అన్నారిగూడెంలో నీట మునిగిన మిర్చి తోటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోతె : తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నామవరం, అన్నారిగూడెం, నర్సింహాపురం, తుమ్మగూడెం, ఉర్లుగొండ, రాఘవాపురం గ్రామాల్లో తుపాన్‌కు దెబ్బతిన్న వరి ధాన్యం, వరి, పత్తి, మిర్చి పంటలను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, సీత శ్రీను, మేదరమెట్ల వెంకటనారాయణ, అర్వపల్లి గణేష్, కార్తీక్, నల్లు కరుణాకర్‌రెడ్డి, మాదగాని సత్యం, తుమ్మెలి అశోక్‌రెడ్డి, పిట్ల నాగయ్య, మామిడి వెంకటేశ్వర్లు, బట్టిపెల్లి నాగమల్లు, దుర్గయ్య, రైతులు పాల్గొన్నారు.

రామాలయ ముఖద్వార ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దాతల సహకారంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయ ముఖద్వారం (గుమ్మం) ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖద్వారం (దర్వాజ)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, నేరేడుచర్లకు చెందిన రాచకొండ రామచందర్‌రావు సోదరులు, కుటుంబసభ్యులు రామాలయం నిర్మాణానికి 18 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆలయ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ తాళ్లూరి సాయి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పాల్వాయి రమేష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, పట్టణ ప్రముఖులు పులిజాల వెంకటరమణరావు, చింతకుంట్ల శ్రీను, వేణుగోపాల్‌రెడ్డి, సీతారాంరెడ్డి, సైదయ్య, భరత్, గోపాల్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, సుబ్బారావు, మహేష్, చిన్నయ్య, బట్టు మధు పాల్గొన్నారు.